క్లుప్తంగా

అక్రమ పట్టా చేశారంటూ నిరసన



లింగాలఘణపురం: తండ్రి పేరుతో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు అక్రమ పట్టా చేశారంటూ మండల కేంద్రానికి చెందిన పోరెడ్డి ఎలేందర్‌రెడ్డి, అతని భార్య శోభారాణి దంపతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 789/బీ, 756/ఏ,బీ, 889/డీలో 1.05 ఎకరాల భూమి తన తండ్రి పోరెడ్డి యాదవరెడ్డి పేరుతో ఉండగా తమ్ముడు భూపాల్‌రెడ్డి ఒక్కడినే కొడుకునంటూ తప్పుడు రికార్డులు సృష్టించి 2019 అక్రమంగా పట్టా చేసుకున్నాడని, అప్పటి రెవెన్యూ అధికారులు తన తమ్మునికి సహకరించి తప్పుడు రికార్డులు చేశారని, ఈ విషయంపై తహసీల్దార్‌ను ప్రశ్నించగా కోర్టులో చూసుకోండని, తాము ఏమీ చేయలేమని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి యాదవరెడ్డి పేరుతో ఉన్న భూమిలో తమకు వచ్చే వాటా ప్రకారం న్యాయం చేయాలని వేడుకున్నాడు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అప్పుడే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటామని బండనాగారం పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్ అన్నారు. సోమవారం గ్రామంలో ఆయన పారిశుద్ధ్య పనులను చేయించారు.

టాపర్‌కు నగదు అందజేత



కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన రేనేశ్వరి పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించగా సోమవారం పాఠశాలకు చెందిన 1991–92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 5 వేల నగదును ఎంఈఓ గ్రేస్‌కేజీయా రాణి చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. అలాగే ఇదే బ్యాచ్‌కు చెందిన ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య సొంతంగా రూ. 2 వేల నగదును రేనేశ్వరికి అందించారు. పాఠశాల విద్యార్థులకు తమవంతు సాయంగా ఈ విద్యా సంవత్సరం మొత్తం మినరల్ వాటర్ ఖర్చును చెల్లిస్తామని పూర్వవిద్యార్థులు తెలిపారు. పాము లక్ష్మీనారాయణ, గుండా పూర్ణచందర్, విష్ణువర్ధన్, రాపోలు నిర్మల, సైదమ్మ, ఉమారాణి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఎడ్ల జాన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం జరిగింది. ఘన్‌పూర్ ఎస్సీ కాలనీకి చెందిన జాన్ తాపీమేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, సోమవారం ఉదయం వ్యక్తిగత పనులపై చిన్నపెండ్యాల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తున్నాడు. దేశాయితండా నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్ వద్ద ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టడంతో జాన్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

బంగారం షాపులో చోరీ



పాలకుర్తి టౌన్ : బంగారం షాపులో నలుగురు మహిళలు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలో జరిగింది. స్థానిక బంగారం షాపులో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన నలుగురు మహిళలకు వెండి వస్తువులు చూపిస్తున్నాడు. ఈ క్రమంలో రెండు వస్తువులు తీసి వెనక ఉన్న మహిళలకు ఇవ్వగా సదరు మహిళా తన చీరలో దాచింది. ఈ చోరీ ఘటన అంతా సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. సుమారు రూ.10 వేలు విలువైన వెండి వస్తువులు చోరీ చేశారని షాపు యజమాని రజనీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై ప్రసన్న కుమార్ తెలిపారు.

సమస్యల వలయంలో వడ్డెగూడెం

- పట్టించుకోని పాలకులు, అధికారులు



బురద రోడ్డుపై నిరసన తెలుపుతున్న ప్రజలు



ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధి వడ్డెగూడెం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పంచాయతీ పరిధిలోని వడ్డెగూడెం 6,7 వార్డుల్లో 150 ఇళ్లు ఉండగా, దాదాపు 500 జనాభా, 425 మంది ఓటర్లు ఉన్నారు. రెండు వార్డులకు కలిపి కేవలం రెండు సీసీ కాగా మిగతావి మట్టి రోడ్లు. చిన్న వర్షం పడినా రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. . ఇక చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. చుట్టపుచూపుగా జీపీ సిబ్బంది వచ్చి చెత్తను తొలిగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వడ్డెగూడెంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓట్లనాడే నాయకులు కనిపిస్తారు..



వడ్డెగూడేనికి ఓట్లప్పుడే నాయకులు వస్తారు. సమస్యలుంటే గ్రామ పంచాయతీలో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరు. ఎప్పుడో ఒక సారి పంచాయతీ సిబ్బంది ఇలావచ్చి అలా పోతారు. ఇకనైనా స్పందించాలి. -కుమారస్వామి, స్థానికుడు

ఇంటిపై కరెంట్ లైను తొలగించాలి..



తమ ఇంటిపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైను తొలగించాలి. ఇటీవల వైర్లు లూజు కావడంతో సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దాంతో తామే కట్టెలను సపోర్టుగా ఏర్పాటు చేశాం. వర్షం పడితే షాక్ వస్తోంది. దీంతో బంగ్లా ఎక్కడం మానేశాం. - లచ్చమ్మ, స్థానికురాలు

ఈ బాధలు ఇంకెన్నాళ్లు..



చినుకు పడితే రోడ్లు చిత్తడవుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోతోంది. దీంతో పాములకు నిలయంగా మారుతోంది. ఈ బాధలు ఇంకెన్నాళ్లు. దీనికి తోడు కోతులు, కుక్కలతో పిల్లలను ఒంటరిగా వదిలి వెళ్ల లేక పోతున్నాం. సమస్యలు పరిష్కరించాలి. - కొమురమ్మ, స్థానికురాలు

సాయుధ పోరాట యోధుడు ఠాణునాయక్



నివాళులర్పిస్తున్న నాయకులు

కొడకండ్ల: నిజాం నిరంకుశ పాలన, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి అమరుడైన సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణునాయక్ అని గిరిజన నాయకులు హేమానినాయక్, గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం ఠాణునాయక్ జయంతిని పురస్కరించుకుని గిర్నితండా వద్ద ఠాణునాయక్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధూమనాయక్, కిషన్‌నాయక్, సోమన్న, హరిచందర్, వినోద్ పాల్గొన్నారు.

ఎంపీటీసీల సేవలు అభినందనీయం



ఎంపీటీసీలతో ఎంపీపీ సరిత

చిల్పూరు: మండల పరిషత్ నిధులతో గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలు చేసిన కృషి అభినందనీయమని ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎంపీటీసీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. నిధుల పరంగా ఇబ్బందులు ఎదురైనా ఎంపీటీసీలు ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూక్య సరితనర్సింహ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కంకటి రవీందర్, ఎన్నకూస కుమార్, పాశం శిరీషసురేష్, తాళ్లపల్లి ఉమమ్మయ్య, మారబోయిన అయిలమ్మ, సాదం నర్సింహులు, మునిపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా..



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తిడుగు గ్రామంలో భవానిశంకర దేవాలయంలో పంచ వార్షిక మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు, ప్రజల ఆశీర్వాదంతో నేను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు నా కుతూరు కడియం కావ్య ఎంపీగా ఎన్నిక కావడం జరిగిందన్నారు. తమ కుటుంబం మొత్తం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉన్నామన్నారు. తిడుగు గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత బజ్జూరి పద్మావతి కృష్ణమూర్తి, బజ్జూరి మణికాంత్, నల్లతీగల భాష, అన్నెబోయిన భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి



జఫర్‌గఢ్: ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలంటూ మహిళలు నిరసన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనగామ, వరంగల్, హనుమకొండ పట్టణాల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి మీదుగా తమ్మడపల్లి (జి)కి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మహిళ సంఘం నాయకురాల్లు రాపర్తి రజిత, లక్ష్మి, బక్క పిచ్చమ్మ, బక్క యాదమ్మ, చొప్పరి వెంకటమ్మ, నక్క అనూష, సుద్దగాని మాధవి, కసరబోయిన కాంతమ్మ, కొంతం ఉప్పమ్మ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



లింగాలఘణపురం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

లింగాలఘణపురం: ఈ నెల 7న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించనున్న మాదిగ, మాదిగ ఉపకులాల దండోరా రజతోత్సవాల కరపత్రాన్ని సోమవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ప్యాట యాకయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి మండలంలోని మాదిగలు, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కుంటి రాంచందర్, ప్రవీర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రాల..

రఘునాథపల్లి: జిల్లా కేంద్రంలో ఈ నెల 4వ తేదీన దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణను పురష్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో జిల్లా కురుమ సంఘం నాయకులు ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్దె మల్లేశం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 4న దొడ్డి కొమురయ్య జయంతిని పురష్కరించుకొని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కురుమకులస్తులు భారీగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు మోట శ్రీశైలం, జూకంటి శ్రీశైలం, కడకంచి మధు, పేర్ని రవి, దేవర మల్లేష్, యాకయ్య, బీరయ్య, రాములు, శంకరయ్య, శ్రీను, జంపయ్య, వీరస్వామి, లక్ష్మణ్, రాజు, మహేష్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

జనగామ రూరల్: దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి సాదం రమేశ్ పిలుపునిచ్చారు. సోమవానం పట్టణంలోని బీరప్ప గుడి ఆవరణలో జిల్లా అధ్యక్షుడు దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వెంకటయ్య, మల్లేశం, బాలరాజు, చంద్రయ్య, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

చేయూత



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన సయ్యద్ రబ్బాని ఇల్లు వర్షం పడినప్పుడు కురుస్తున్న విషయం తెలుసుకుని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి తనవంతుగా బాధితుడికి ఇంటిపై కప్పుకోవడం కోసం రూ.3వేలు విలువైన టార్పాలిన్‌షీట్లు కొనుగోలు చేసి సోమవారం అందజేశారు. రమేష్, మల్లేశం, బుచ్చయ్య, రాజు, సబ్జర్ అలీ, సంపత్, రాజు, సాజిద్, సలీమ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మొక్క నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రఘునాథపల్లి: జూలై 1వ తేదీ నూతన లయన్సిటిక్ సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు రఘునాథపల్లి లయన్స్ క్లబ్ పలు సేవాకార్యక్రమాలను చేపట్టింది. మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలిగించి పూల మొక్కలను నాటారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కందుల అనీల్‌కుమార్ మాట్లాడుతూ వైద్యులు అందించే సేవలు వెలకట్టలేనివని అన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ కూర్నెళ్ల ఉపేందర్, పూర్వ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, క్లబ్ కోశాధికారి కోళ్ల రాజు, వాయినాల సురేష్, రహీంపాషా, ఇమ్మడిశెట్టి కరుణాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సమావేశాలు



దేవరుప్పుల: మాట్లాడుతున్న శ్రీరాములు

పాలకుర్తి: ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకే గ్రామ సమావేశాలు నిర్వహిస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కొండపురం గ్రామంలో సమస్యల గుర్తింపునకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చర్చి, పోచమ్మ గుడి, జీపీ భవన నిర్మాణం, తాగునీటి, విద్యుత్ సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. సమస్యలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ ఎంపీపీ గడ్డం యాకసోమయ్య, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలగం కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు మంగ అంజయ్య, శ్రీశైలం, సాయిలు, అనిల్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారం

దేవరుప్పుల: గ్రామాల్లోని ప్రజా సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సహకారంతో పరిష్కారం కోసం కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్లా శ్రీరాములు అన్నారు. సోమవారం సింగరాజుపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల వద్దకెళ్లి వినతులు స్వీకరిస్తున్నామని, ప్రజల వద్దకే ప్రజా పాలన తరహాలో సమస్యలు తెలుసుకు ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల సహకారంతో పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. నాయకులు ఉప్పల సురేష్‌బాబు, ధర్మారెడ్డి, రవిందర్‌రెడ్డి, యాదగిరి, నాగరాజు, పాండు, గణేష్, పురుషోత్తం, మల్లారెడ్డి, గణేష్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం'



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల: కొడకండ్ల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సోమనర్సయ్య, సునీల్‌రెడ్డి, వెంగల్‌రావు, శ్రీవర్ధ, భిక్షపతి, రవీందర్, యాకేష్, వెంకన్న, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన స్థలంలోనే నిర్మించుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

చిల్పూరు: కేటాయించిన స్థలాల్లోనే కమ్యూనిటీ భవనాలు నిర్మించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా తెలిపారు. కృష్ణాజీగూడేనికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సాదం ఆటో భీమన్న ఆధ్వర్యంలో మహిళా సంఘం నాయకురాలు, మాజీ ఎంపీటీసీ కొరిపెల్లి రాజహంస తదితరులు జిల్లా కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజహంస మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే స్థలంలో నాలుగు ప్లాట్లు ఆరోగ్య ఉప కేంద్రం, పశువైద్యశాల, మహిళా సంఘం భవనం నిర్మాణానికి జీపీ తీర్మానంతో కేటాయించడం జరిగిందని, అయితే ఇటీవల ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం ఉన్నప్పటికీ మహిళా సంఘం భవనానికి కేటాయించిన స్థలంలో పనులు ప్రారంభిస్తే అడ్డుకున్నామన్నారు. విషయాన్ని అధికారులకు తెలుపగా పనులు నిలిపివేయాలని ఆదేశించినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయగా నేటి నుంచి (మంగళవారం) ఎవరి స్థలంలో వారే సంఘం భవనాన్ని నిర్మించుకోవాలని ఆదేశించారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సాదం రాజేందర్, సాదం మల్లేషం, సీఏలు కోతి మాధవి, వడ్లకొండ రజిత, సాదం శ్రావణి, సాదం శైలు, రాజశేఖర్‌రెడ్డి, సాదం లింగయ్య, రామరాజుతోపాటు తదితరులు ఉన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సన్మానిస్తున్న మౌనిక తదితరులు



వైద్యులను సన్మానిస్తున్న ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ బాధ్యులు



పాలకుర్తిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి వడ్లూరి మౌనిక అన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఘనంగా డాక్టర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వైద్యులను శాలువాలతో సన్మానించారు. అనంతరం వైద్యులచే కేక్ కట్ చేయించి వైద్యులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని, వైద్యులు దైవ సమానమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, షేక్ జానీ, ప్రత్యూష్, మహిళా నాయకులు దారపద్మ, నాగమణి, స్రవంతి, నిరోష పాల్గొన్నారు.

ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన వైద్యులను స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ జయంతి పురస్కరించుకొని సందర్భంగా డాక్టర్స్‌డే నిర్వహిస్తారన్నారు. వైద్యో నారాయణ హరి అన్నట్లుగా వైద్యులు దైవంతో సమానమని, వైద్యులకు క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ బాధ్యులు ఎం.వెంకటేశ్వర్లు, ఆమంచ మధుసూధన్, పి.వెంకటేశం, విజయ్‌చందర్, గట్టు రమేష్, గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో..

ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి వైద్యులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఎం డాక్టర్ సుధీర్, సీహెచ్ఓ సాంబయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్లు ప్రసన్నకృష్ణ, జనార్ధన్, శంకర్, సంధ్య, రజని, సుమన్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో..

పాలకుర్తి టౌన్: డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాలకుర్తిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య, క్లబ్ జోన్ చైర్మన్ బజ్జూరి వేణుగోపాల్, ఎర్రబెల్లి రాఘవరావు, పల్లెపాటి జైపాల్‌రావు, డాక్టర్లు మంద బుచ్చిరెడ్డి, భూక్య రవి రాథక్షడ్, అవిరినేని అపర్ణ, సంజయ్, మహేందర్, మహేందర్, పబ్బ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీసీఓ రాజేందర్‌రెడ్డి

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'రైతు భరోసా'పై అన్నదాతలు అవగాహన కలిగి ఉండాలని డీసీఓ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రైతు వేదిక భవనంలో పీఏసీఎస్ పులిగిల్ల పూర్ణచందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.'రైతు భరోసా' సాయాన్ని ఎవరికి అందించాలనే విషయమై అభిప్రాయాలు సేకరిస్తున్నామని, 114 మంది రైతులు పాల్గొన్నారని చెప్పారు. ఇందులో ఐదెకరాలకు ఇవ్వాలని 67 మంది, 10 ఎకరాలకు 39 మంది, సాగు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని 8 మంది అభిప్రాయాన్ని వెలిబుచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి, డైరెక్టర్లు దాసారం శ్రీనివాస్, వేముల లక్ష్మణ్‌గౌడ్, టేకులపెల్లి ప్రభాకర్, సీఈఓ కాశ బాలస్వామి, నాయకులు నిడిగొండ శ్రీనివాస్, పిన్నింటి బాపురెడ్డి పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక ప్రగతికి రైతు భరోసా

జనగామ రూరల్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చేందడానికి ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చీటకోడూర్, పెంబర్తి గ్రామంలో రైతు వేదికలో రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ హాజరై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. సీఈఓలు రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, చైర్మన్ చిర్ర శ్రీనివాస్ రెడ్డి ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఐదు ఎకరాలకే రైతు భరోసా ఇవ్వాలి

నర్మెట: సాగు యోగ్యమైన ఐదు ఎకరాలకే ప్రభుత్వం రైతులకు సాగు భరోసా అందించాలని పీఏసీఎస్ చైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, మండల రైతులు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన రైతు భరోసా అమలు తీరుతెన్నులపై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. భూములు, పలు రకాల ఆస్తులు, ఆదాయం కలిగిన రైతులు రైతు భరోసాను స్వచ్ఛందగా వదులు కోవాలని తాను సైతం రైతు భరోసాను వదులుకుంటానని ఈ సందర్భంగా చైర్మన్ సభకు తెలిపారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు డీసీఓ రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జేఏ తోట సంతోష్, ఏఓ ధరావత్ సంతోషి, ఉపాధ్యక్షుడు నక్కల గట్టయ్య, సీఈఓ కొన్నె వెంకటయ్య, డైరెక్టర్లు, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.